క్లుప్తంగా

క్రీడాకారులు పేర్లు నమోదు చేసుకోవాలి

జి.సిగడాం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాంగా నిర్వహిస్తున్న ఆడుదాం.. ఆంధ్ర క్రీడా పోటీలకు అర్హులైన అందరూ వారి పేర్లను సంబంధిత సచివాలయంలో నమోదు చేసుకోవాలని ఎంఈఓలు అరసాడ రవి, ముల్ల శ్రీనివాసరావు కోరారు. గురువారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. అక్టోబర్ 2వ తేదీ నుంచి సచివాలయం పరిధిలో వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహిస్తామన్నారు. మైదానంలో మౌలిక సదుపాయలపై సిబ్బంది సూచించారు.

బధిరులకు అండగా లయన్స్ క్లబ్



బధిరులతో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: విజయనగరం జిల్లా గరివిడికి చెందిన 15 మంది బధిరులు(చెవిటి, మూగ చిన్నారులు) సదరం ధ్రువపత్రాల కోసం గురువారం శ్రీకాకుళం రిమ్స్‌కు వచ్చారు. విషయం తెలుసుకున్న శ్రీకాకుళం సెంట్రల్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు పొన్నాడ రవి కుమార్ రిమ్స్ సూపరింటెండెంట్‌ను కలిసి సర్టిఫికెట్లు సకాలంలో అందేలా ఏర్పాట్లు చేశారు. భోజన, వసతి సదుపాయం కల్పించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, సెక్రటరీ రామ్ గోపాల్, సభ్యులు కామేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ పేదలకు వరం



పెంట గ్రామంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

జి.సిగడాం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా పల్లెల్లో ఇంటింటికీ వెళ్లి వైద్యం అందించడం పేదలకు వరమని, ఇటువంటి సేవలను వినియోగించుకోవాలని జి.సిగడాం వైద్యాధికారి పొన్నాడ హరితాశ్రీ అన్నారు. పెంట సచివాలయం పరిధిలో నాగులవలస, పెంట గ్రామాల్లో గురువారం వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. మంచానికి పరిమితమైన రోగుల ఇంటి వద్దకు వెళ్లి వైద్య సేవలు అందజేశారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు గుర్తించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

ఎచ్చెర్ల: మండలంలోని ప్రభుత్వ భూములను గుర్తించి, ఆక్రమణలు ఉంటే వాటిని వెంటనే తొలగించాలని మండల తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓలతో రెవెన్యూ సమస్యలపై గురువారం సమీక్ష నిర్వహించారు. రైతుల నుంచి వస్తున్న భూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. నాలా వసూలు వేగవంతంగా చేపట్టాలన్నారు. రీసర్వేలను త్వరితగతిన పూర్తిచేయాలని తెలిపారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న జిల్లా బాలల రక్షణ విభాగం ఐసీపీఎస్ గీత

ఎచ్చెర్ల: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని జిల్లా బాలల రక్షణ విభాగం ఐసీపీఎస్ ఎ.గీత అన్నారు. అల్లినగరం ఉన్నత పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గురువారం బాలల హక్కులు, ఈవ్‌టీజింగ్, మానవ అక్రమ రవాణా, గుడ్‌టచ్, దిశ యాప్, 1098, మారకద్రవ్యాలు వంటి వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. బాలల హక్కులను పరిరక్షించడానికి అనేక చట్టాలు ఉన్నాయన్నారు. ఎటువంటి ఆపద వచ్చినా 1098కి ఫోన్ చేయాలన్నారు. మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఎస్సై ఎస్.కేశవరావు, బి.రాములమ్మ, హెచ్‌ఎం కె.పార్థశారధి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాతర్లపల్లి హైస్కూల్‌లో..

రణస్థలం: రాజ్యాంగం కల్పించిన హక్కులపై అవగాహన ఉండాలని జే.ఆర్.పురం ఏఎస్సై డి.రమణమూర్తి తెలిపారు. మండలంలోని పాతర్లపల్లి హైస్కూల్‌లో జే.ఆర్.పురం ఎస్సై జి.రాజేష్ ఆదేశాల మేరకు బాలల హక్కులు, బాల్య వివాహాలు, బాల కార్మికులు దుస్థితిపై గురువారం అవగాహన కల్పించారు. గ్రామాల్లో బాలల హక్కులను ఎవరైనా హరించిన, బాల్య వివాహాలు జరిపిన 1098 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత గురజాడ



శ్రీకాకుళం రూరల్: గురజాడ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జి.వి.స్వామినాయుడు



శ్రీకాకుళం అర్బన్: కేంద్ర గ్రంథాలయంలో గురజాడ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ఎన్‌సీఎస్‌లో గురజాడ చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న దృశ్యం



శ్రీకాకుళం అర్బన్: గాంధీమందిరంలో గురజాడ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కమిటీ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: దేశమును ప్రేమించుమన్నా.. అంటూ గురజాడ ఇచ్చిన నినాదాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించడమే ఆయనకు మనం ఇచ్చే నిజమైన నివాళి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న గాంధీమందిరంలో సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు 161వ జయంతి వేడుకలు మందిర కమిటీ ప్రతినిధులు గురువారం నిర్వహించారు. గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ జామి భీమశంకర్, వి.జి.కె. మూర్తి, పైడి హరనాథరావు, నటుకుల మోహన్, మెట్ట అనంతం భట్లు, నక్క శంకరరావు, గుత్తు చిన్నారావు, పొన్నాడ రవికుమార్, కొమ్ము రమణమూర్తి, గోపి, తర్లాడ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్: సాహితి సంస్కరణవాది గురజాడ అప్పారావు అని గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు అన్నారు. గురువారం విద్యాసంస్థల ఆవరణలో గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్ర గ్రంథాలయంలో గురజాడ అప్పారావు జయంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బి.కుమార్‌రాజు, లైబ్రేరియన్ ఎస్.వి.రమణమూర్తి, కె.చిరంజీవులు, పి.వరలక్ష్మి, యు.కల్యాణి, ప్రత్యూష, పి.భానుమతి, పి.రామమోహన్, గణేష్, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం న్యూకాలనీ: గురజాడ అప్పారావు 161వ జయంతి వేడుకలు విద్యా సంస్థల్లో ఘనంగా జరిగాయి. శ్రీకాకుళంలోని పాఠశాలలు, కళాశాలల్లో గురజాడ చిత్రపటాలకు నివాళ్లర్పించారు.

శ్రీకాకుళం కల్చరల్: ఇల్లిసుపురంలోని అంబేడ్కర్ భవన్‌లో గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో చర్చావేదిక నిర్వహించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు వి.జి.కె.మూర్తి, చంద్రపతిరావు, ఎస్.కృష్ణవేణి, చింతాడ రామారావు, కె.శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో హోంలో గురజాడ జయంతి సమావేశం నిర్వహించారు. అనంతరం గురజాడ రచనలతో కూడిన 'కవితా స్రవంతి' పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ, అరసం జిల్లా అధ్యక్షుడు నల్లి ధర్మారావు, ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి శరత్ తదితరులు దాసరి రామచంద్రరావు, ముట్నూరు ఉపేంద్రశర్మ, భాస్కరరావు, మల్లేశ్వరరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో..

జి.సిగడాం: స్థానిక కేజీబీవీలో గురజాడ జయంతిని ప్రత్యేక అధికారి డి.ఉషారత్నకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు, గురజాడ రచనలు, సాహిత్యం, ఆయన అందించిన సేవలను వివరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త శకానికి వెలుగు చూపిన గురజాడ

ఎచ్చెర్ల క్యాంపస్: కొత్త శకానికి వెలుగు చూపిన గొప్ప రచయత గురజాడ అప్పారావు అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ బిడ్డిక అడ్డయ్య అన్నారు. వర్సిటీలోని తెలుగు విభాగం ఆధ్వర్యంలో గురజాడ జయంతిని నిర్వహించారు. సమాజంలో లోపాలు, బాల్య వివాహాలు, అసమానతలను ఎత్తిచూపిన రచయత గురజాడ అని అన్నారు. ప్రజలు హృదయాలను గురజాడ రచనలు తాకాయన్నారు. బోధన సిబ్బంది జక్కు రామకృష్ణ, ఉమ్మడి శాంతి, గుంట లీలావరప్రసాద్ పాల్గొన్నారు.

ధర్మవరం గ్రంథాలయంలో..

ధర్మవరం శాఖా గ్రంథాలయంలో గురజాడ అప్పారావు జయంతిని నిర్వహించారు. గురజాడ గొప్పతనాన్ని గ్రంథాలయాధికారి మలిపెద్ది చంద్రశేఖర్‌రావు విద్యార్థులకు వివరించారు. కన్యాశుల్కం నాటకం ప్రజల్లో చైతన్యం తెచ్చిందన్నారు. సహాయ లైబ్రేరియన్ బి.సూర్యనారాయణ, పాఠకులు పాల్గొన్నారు.

సమాజాన్ని మేల్కొల్పిన గురజాడ..

రణస్థలం: గురజాడ అప్పారావు తన రచనలతో సమాజాన్ని మేల్కొల్పారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పిన్నింటి సాయికుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో గురజాడ జయంతిని పురస్కష్కరించుకుని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గురజాడ భావితరాలకు ఆదర్శనీయమైన రచనలు అందించారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు టొంపల సీతారాం, ఎంపీడీఓ ఆర్.రమణమూర్తి, ఎంఈఓ త్రినాథరావు, ఏపీఓ శ్రీనివాసనాయుడు, మండల పరిషత్ ఏఓ ధనుంజయరావు, మండల నాయకులు మహంతి పెదరామినాయుడు, చినరామునాయుడు, బడి రాంబాబు, కొమ్ము సాయికుమార్, మింది శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్



శ్రీకాకుళం న్యూకాలనీ: గురజాడ చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కళాశాల ప్రతినిధులు



శ్రీకాకుళం కల్చరల్: చర్చావేదికలో మాట్లాడుతున్న వి.జి.కె.మూర్తి



శ్రీకాకుళం కల్చరల్: కవితాస్రవంతి పుస్తకావిష్కరణ చేస్తున్న అతిథులు



శ్రీకాకుళం పాతబస్టాండ్: గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న బీసీ న్యాయవాదుల సంఘం ప్రతినిధులు



జి.సిగడాం: కేజీబీవీలో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రత్యేకాధికారి, సిబ్బంది



ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గురజాడ చిత్రపటానికి నివాళులర్పింస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల క్యాంపస్: ధర్మవరం గ్రంథాలయంలో గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి, పాఠకులు



రణస్థలం: గురజాడ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాయికుమార్, అధికారులు

99 శాతం రికవరీలు చేపట్టాం

ఎచ్చెర్ల: స్వయం సహాయక సంఘాలకు గ్రామ సంఘాలు, ఉన్నతి, స్త్రీనిధి ద్వారా అందించిన రుణాలకు సంబంధించి 99 శాతం రికవరీలు చేపట్టడం జరిగిందని వెలుగు ఏపీఎం రామ్మూర్తి తెలిపారు. వెలుగు కార్యాలయం వద్ద రికవరీలకు సంబంధించి గురువారం నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో పాల్గొన్నారు. సంస్థాగత నిర్మాణ డైరెక్టర్ రుణాల రికవరీపై జూమ్ మీటింగ్ నిర్వహించారని తెలిపారు. ఎచ్చెర్ల మండలానికి సంబంధించి గ్రామ సంఘాల నుంచి ఇచ్చిన రుణాలను శతశాతం రికవరీ, స్త్రీనిధికి సంబంధించి 99 శాతం, ఉన్నతికి సంబంధించి 98 శాతం రికవరీలు చేపట్టడం జరిగిందన్నారు.

మహిళా రైతు సంఘాల ఏర్పాటు..

మండలంలోని మహిళా రైతు సంఘాలను ఏర్పాటు చేస్తామన్నారు. వ్యవసాయం, మార్కెటింగ్ వంటివి సంఘటితంగా చేపట్టడానికి ఈ సంఘాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మండలంలోని 300 సంఘాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. ఇప్పటివరకు 211 సంఘాలు ఏర్పాటు చేశామన్నారు.



జూమ్ మీటింగ్‌లో పాల్గొన్న ఏపీఎం, వెలుగు సిబ్బంది

ముద్దాడలో పశువైద్య శిబిరం

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ గ్రామంలో పశువైద్య శిబిరం రిలయన్స్ ఫౌండేషన్, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. 45 పాడి పశువులకు డాక్టర్ సాయిప్రసాద్ వైద్య సేవలు అందించారు. పశువులకు వచ్చే వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి తిరుమలరావు, రాజారావు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పించనున్న నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి తోటపాలెంలో గురువారం క్షీరాభిషేకం నిర్వహించారు. విజయనగరం పార్లమెంట్ బీజేపీ అధ్యక్షుడు నడుకుదిటి ఈశ్వరావు హాజరయ్యారు. దశాబ్దాల మహిళలు పోరాటం ఫలించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎచ్చెర్ల బీజేపీ మండల అధ్యక్షుడు సంపతిరావు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాత పెన్షన్ స్కీమ్ పునరుద్ధరించాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రప్రభుత్వం నూతనంగా తీసుకొస్తున్న జీపీఎస్‌కు పీఆర్‌టీయూ వ్యతిరేకమనిసంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు బైరి అప్పారావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తంగి మురళీమోహనరావు, దానేటి కేశవరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఎస్‌ను పూర్తిగా రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను పునరిద్ధరించాలని కోరారు.

మజ్జి తులసీదాస్ సేవలు చిరస్మరణీయం



తులసీదాస్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న స్వామినాయుడు



మజ్జి తులసీదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం రూరల్: వ్యవస్థ విజయాలకు సమష్టి కృషి ప్రధాన కారణమని చెప్పిన మహా మనిషి మజ్జి తులసీదాస్ అని గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు అన్నారు. గురువారం గురజాడ ప్రాంగణంలో మజ్జి తులసీదాస్ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా స్వామినాయుడు మాట్లాడుతూ విద్యాసంస్థలో తులసీదాస్ అందించిన సేవలు చిరస్మరనీయమని కొనియాడారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అంబటి రంగారావు, ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, శిష్టు రమేష్, జగదీష్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): దివంగత మజ్జి తులసీదాసు కళింగ జాతికే వన్నెతెచ్చిన మహనీయుడని కళింగ సంక్షేమ సేవా సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పొట్నూరు సూర్యం అన్నారు. కళింగభవన్‌లో తులసీదాస్ వర్ధంతి గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు బుడుమూరు శ్రీరామమూర్తి, జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ గురుగుబెల్లి రామమోహన్, డాక్టర్ బగాది శ్రీరామమూర్తి, డాక్టర్ బొడ్డేపల్లి దామోదర్, కొండల నాగేశ్వరరావు, పేడాడ వైకుంఠరావు, కూన సత్యనారాయణ, బగాది వెంకటరావు, జాతీయ వైస్ ప్రెసిడెంట్, పొన్నాడ ప్రభాకరరావు డాక్టర్ గురుగుబెల్లి దామోదర్, మెట్ట అన్నజీ భట్లు పాల్గొన్నారు.

ప్రతిభ ఆధారంగానే సీట్లు భర్తీచేయాలి

శ్రీకాకుళం అర్బన్: సుప్రీంకోర్టు నిబంధనలకు మేరకు మెడికల్ కళాశాల సీట్లకు సంబంధించి మొట్టమొదట ఓపెన్ క్యాటగిరి సీట్లను ప్రతిభ ఆధారంగానే భర్తీ చేయాలని డీసీసీ అధ్యక్షురాలు బొడ్డేపల్లి సత్యవతి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దేశేళ్ల గోవింద మల్లిబాబు, లఖినేన నారాయణరావు, పైడి నాగభూషణరావు, రెల్ల సురేష్, కె.వి.ఎల్.ఎస్. ఈశ్వరి, లఖినేన సాయిరాం, అంబటి దాలినాయుడు, బొచ్చ రమణ, బైరి రాజేశ్వరరావు, అప్పారావు, దాలయ్య, పీజే నాయుడు, రెహమాన్ పాల్గొన్నారు.



జేసీ నవీన్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహిళా రిజర్వేషన్ శుభపరిణామం

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ శుభపరిణామమని ఎచ్చెర్ల జెడ్పీటీసీ సభ్యురాలు, రాష్ట్ర మహిళా ఆర్థిక సహకార సంస్థ అధ్యక్షురాలు బల్లాడ హేమమాలినిరెడ్డి అన్నారు. ఎచ్చెర్లలో ఆమె గురువారం మాట్లాడారు. దశాబ్దాల పోరాటం ఇప్పటికి నెరవేరిందన్నారు. అమలు సైతం త్వరితగతిన జరగాలన్నారు. మహిళలకు చట్ట సభల్లో భాగస్వామ్యం వల్ల సమాజంలో అసమానతులు తొలగిపోతాయని, చట్ట సభల్లో అర్థవంతమైన చర్చలు జరుగుతాయన్నారు. పాలనలో మహిళల ప్రాధాన్యత పెరిగేందుకు దోహదపడుతుందన్నారు.

విఘ్నాధిపతికి విశేష పూజలు



కాలభైరవ పీఠంలో ప్రత్యేక అలంకరణ



పుష్పాలంకరణలో సంపత్ వినాయకుడు



కంపోస్టు కాలనీలో కాళీయమర్దన వినాయకుడు

విఘ్నాధిపతి వినాయకుడికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలతో పాటు చవితి మండపాల్లో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు జరిగాయి.

– శ్రీకాకుళం కల్చరల్

నేటినుంచి స్కూల్ గేమ్స్ ఎంపికలు

ఎచ్చెర్ల క్యాంపస్: కేశవరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎచ్చెర్ల నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపికలు శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా పీఈటీ అసోసియేషన్ అధ్యక్షుడు, కేశవరావుపేట పీఈటీ మొజ్జాడ వెంకటరమణ గురువారం తెలిపారు. కబడ్డీ, ఖోఖో, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటెన్, బ్యాడ్మింటెన్, యోగా, టెన్నికాయిట్, అథ్లెట్స్‌లో అండర్ 14, 17 విభాగాల్లో బాల, బాలికలకు పోటీలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయిలో విజేతలు 1200 మందివరకు హాజరవుతారన్నారు. ఈ విజేతలు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారన్నారు.

లయన్స్‌క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి కార్యవర్గం ఎన్నిక

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సేవే పరమావధిగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం హర్షవల్లి ఏర్పాటు చేయడం అభినందనీయమని డిస్ట్రిక్ గవర్నర్ ఎ.గోపాలరావు అన్నారు. శ్రీకాకుళం నగరంలో ఓ ప్రవేటు హోటల్‌లో లయన్స్ క్లబ్ హర్షవల్లి నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. వ్యవస్థాపక అధ్యక్షునిగా కె.ఎన్.ఎస్.వి.ప్రసాద్(హారికా ప్రసాద్), అధ్యక్షునిగా కరణం శోభారాణి, ఉపాధ్యక్షుడు-1 వావిలాపల్లి జగన్నాథనాయుడు, ఉపాధ్యక్షుడు-2గా గెడ్డావు కృష్ణప్రసాద్, సెక్రటరీగా రౌతు శ్రీనివాసరావు, ట్రెజరర్‌గా తర్లాడ అప్పలచంద్రశేఖర నాయుడు, మెంబర్‌షిప్ కమిటీ చైర్మన్‌గా కె.పార్వతీశ్వరరావు, క్లబ్ ఎల్‌సీఐఎఫ్ కో-ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎం.సత్యస్వరూప్, క్లబ్ సర్వీస్ చైర్‌పర్సన్‌గా పాలిశెట్టి మధుబాబు, క్లబ్ మార్కెటింగ్ కమ్యూనికేషన్స్ చైర్‌పర్సన్‌గా ఎస్.బ్రహ్మాజీ, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా జి.బాలగాంధీ, క్లబ్ డైరెక్టర్‌గా డాక్టర్ సీహెచ్ కృష్ణమోహన్, 23 చార్టర్ మెంబర్స్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ ఎం.ఉషారాజు, గత డిస్ట్రిక్ గవర్నర్ ఉమామహేశ్వరరావు, రెండో వైస్ డిస్ట్రిక్ గవర్నర్ డి.సూర్యప్రకాష్, రీజియన్ చైర్‌పర్సన్ తూముల శ్రీనివాసరావు, రిటైర్డ్ అదనపు జిల్లా వైద్యాధికారి చింతాడ కృష్ణమోహన్, రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ జగన్‌మోహనరావు, జామి భీమశంకర్, ఏసీబీ సీఐ భాస్కరరావు, డాక్టర్ అన్నంనాయుడు, కోట పార్వతీశ్వరరావు, డాక్టర్ సుధీర్ పాల్గొన్నారు.



నూతన అధ్యక్షురాలు శోభారాణికి బహుమతి అందిస్తున్న దృశ్యం

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

లావేరు: గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజ్ అన్నారు. మండలంలోని లావేరు గ్రామంలో గల శాఖాగ్రంథాలయాన్ని గురువారం సందర్శించి పలు రికార్డులను తనిఖీ చేశారు. గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం, పుస్తక ప్రదర్శన, చిల్డ్రన్స్ క్లబ్ వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రంథాలయాధికారి ఎం.శ్రీనివాసరావు, సహాయకుడు ఎ.గడ్డెయ్య పాల్గొన్నారు.

ఓటు హక్కు కోసం 20,281 దరఖాస్తులు

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం నియోజకవర్గంలో 2024 ఎన్నికలకు సంబంధించి ఏప్రిల్ 15 నుంచి సెప్టెంబర్ 18 వరకు 20,281 దరఖాస్తులు పరిశీలనకు వచ్చాయి. ఇప్పటికే రాజకీయ పార్టీ నాయకులతో 11 విడతలుగా శ్రీకాకుళం తహశీల్దార్ కార్యాలయంలో సమావేశాలు నిర్వహించారు. ప్రధానంగా ఫారం -6,7,8 లకు గాను కొత్త ఓట్ల నమోదు, తొలగింపు, సరిచేయడం తదితర వాటి కోసం దరఖాస్తులు వచ్చాయి. గార మండలానికి 5532, శ్రీకాకుళం మండలానికి 14,749 దరఖాస్తులు వచ్చాయి. డ్రాఫ్ట్ పబ్లికేషన్ అక్టోబర్ 17న విడుదల కానుంది. తర్వాత అభ్యంతరాలు ఉంటే సరిచేసుకునే వెసులుబాటు కల్పించనున్నారు. దరఖాస్తులను ఎప్పటికప్పుడు కంప్యూటర్‌లో నమోదు చేస్తున్నారు. శ్రీకాకుళం మండల తహశీల్దార్ ఎన్.వెంకట్రావు పర్యవేక్షిస్తున్నారు.